భారత
కమ్యూనిస్టు పార్టీ
(మార్క్సిస్టు)

# జాతీయ అంతర్జాతీయ పరిణామాలపై నివేదిక

(2024 సెప్టెంబర్ 29,30 తేదీల్లో న్యూ ఢిల్లీలో జరిగిన
కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించిది)

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

**జాతీయ అంతర్జాతీయ పరిణామాలపై నివేదిక**

**(2024 సెప్టెంబర్ 29,30 తేదీల్లో న్యూ ఢిల్లీలో జరిగిన**

**కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించిది)**

## అంతర్జాతీయం

**ఇ**టీవలి కాలంలో అంతర్జాతీయ పరిస్థితులను రెండు ఘర్షణలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతిహనన యుద్ధం, ఇది తాజాగా లెబనాన్‌కు విస్తరిస్తోంది. రెండోది రష్యా – ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం. ఇది క్రమేపి తీవ్రమవుతున్నది. మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంకలో ముఖ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి.

### పాలస్తీనీయన్లపై ఇజ్రాయిల్ యుద్ధం

హమాస్ దాడికి ప్రతిదాడి పేరిట గాజాపై ఇజ్రాయిల్ ప్రారంభించిన దురాక్రమణకు అక్టోబరు 7వ తేదీతో ఏడాది పూర్తవుతుంది. ఈ ఏడాది కాలంలో గాజా క్రూరమైన యుద్ధానికి గురైంది. దీని ఫలితంగా 42వేల మంది పాలస్తీనియన్లు మరణించారు. వారిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలున్నారు. భవనాల శిథిలాల కింద మరో 10వేల మంది సమాధి అయ్యారు. చాలా భూభాగం నేలమట్టం అయ్యింది. పౌరులు తలదాచుకుంటున్నందున పాఠశాలలు, ఆసుపత్రులను లక్ష్యాలుగా చేసుకుని ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగానే దాడులు చేస్తోంది.

ఇజ్రాయిల్ చర్యలు జాతిహననానికి దారి తీస్తాయని అంతర్జాతీయ న్యాయస్థానం ప్రకటించింది. ఇజ్రాయిల్ అటువంటి సైనిక కార్యకలాపాలకు

దూరంగా ఉండాలని కోరింది. అయినప్పటికీ ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలపై తన మారణహోమాన్ని కొనసాగిస్తోంది. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను అనుసరించి శిక్షార్హమైనప్పటికీ ఇజ్రాయిల్ ఇంతలా బరితెగించడానికి అమెరికా అందిస్తున్న సంపూర్ణ మద్దతే కారణం. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ ఇటీవల అమెరికాను సందర్శించినప్పుడు అమెరికా కాంగ్రెస్‌కు చెందిన రెండు సభలు నిలబడి హర్షాతిరేకాలతో ఆహ్వానం పలకడంతో ఈ కుట్రపూరిత మద్ధతు పూర్తిగా బహిర్గతమైంది. ఈ సందర్భంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని అధ్యక్షుడు బైడెన్ ప్రతిపాదించినప్పటికీ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ నిరాకరించాడు.

ఈలోగా బీరూట్, దక్షిణ లెబనాన్ లోని హిజ్బుల్లా నాయకులు, కార్యకర్తలను ఇజ్రాయిల్ లక్ష్యంగా చేసుకోవడంతో, ఇజ్రాయిల్ సాయుధ దళాలకు లెబనాన్ లోని హిజ్బుల్లాలకు మధ్య సరిహద్దులో దాడులు ఒక్కసారిగా పెరిగిపోయాయి. పేజర్లలో బాంబులు పెట్టి పేల్చడం ద్వారా వారి సమాచార వ్యవస్థ ధ్వంసం అవ్వటంతో పాటు అనేకమంది హిజ్బుల్లా మిలటరీ నాయకులు హతమైపోయారు. ఇజ్రాయిల్ వైమానిక దాడులలో వేలాది మంది మరణించారు. లెబనాన్, సిరియా భూ భాగాలపై బాంబు దాడి చేయడంతో పాటు, టెహ్రాన్‌లో హమాస్ నాయకుడు హానీయాను ఇజ్రాయిల్ హతమార్చడంతో పశ్చిమాసియాలో యుద్ధం విస్తరిస్తోంది.

## ఉక్రెయిన్ యుద్ధం

రష్యా– ఉక్రెయిన్ యుద్ధంలో ఇరువైపులా దాడులు పెరిగాయి. అమెరికా, నాటో దేశాలు ఆయుధాల పరంగా, ఆర్థిక పరంగా సంపూర్ణ మద్దతును అందిస్తున్నప్పటికీ, తన తూర్పు భూభాగం నుండి రష్యన్లను వెనక్కి నెట్టడంలోగానీ, తన సరిహద్దులను కాపాడుకోవడంలోగానీ ఉక్రెయిన్ విఫలమవుతోంది. డాన్‌బాస్‌పై తన పట్టును మరింత పెంచుకున్న రష్యా ఇప్పుడు ఉక్రెయిన్‌కు వ్యూహాత్మక ప్రాంతమైన పోక్రాస్క్ పట్టణాన్ని బెదిరిస్తోంది. ఉక్రేనియన్ సాయుధ దళాలు రష్యాలోని కర్స్క్ ప్రాంతంపై ఆకస్మికదాడి చేసి సరిహద్దు నుండి 50 కిలోమీటర్ల వరకు చొచ్చుకుపోగలిగాయి. అయితే ఇదేమీ డాన్‌బాస్ ప్రాంతంపై రష్యా అదుపును మళ్లించలేకపోయింది. అమెరికా, నాటో దేశాలు కలిసి మరో 40 బిలియన్

యూరోలను భద్రతా సహాయం కింద హామీనిచ్చాయి. దీనికి అదనంగా అమెరికా మరో 225 మిలియన్ డాలర్ల సైనిక సహాయ ప్యాకేజీని కూడా ప్రకటించింది. రష్యాను బలహీనపర్చి లొంగదీసుకునేందుకు ఉక్రెయిన్‌ను ఉపయోగించడం కొనసాగించాలని అమెరికా నిశ్చయించుకుంది. అమెరికా తాను సరఫరా చేసిన దీర్ఘ శ్రేణి క్షిపణులను ప్రయోగించేందుకు ఉక్రెయిన్‌కు అనుమతినిస్తే, అందుకు ప్రతిగా నాటో మిత్రదేశాలపై రష్యా దాడులకు దిగితే యుద్ధం మరింత తీవ్రతరమవుతుంది.

## ఎన్నికల్లో మితవాద శక్తులపై చేయి

**యూరోపియన్ యూనియన్ ఎన్నికలు :** 2024లో జరిగిన యూరోపియన్ యూనియన్ ఎన్నికలలో చాలా దేశాలలో పచ్చి మితవాద శక్తులు గణనీయమైన విజయాలు సాధించాయి. మధ్యేవాద మితవాద పార్టీ అయిన యూరోపియన్ పీపుల్స్ పార్టీ (ఇపిపి) తన ప్రాతినిధ్యాన్ని 184 పార్లమెంటు స్థానాలకు పెంచుకుంది. యూరోపియన్ పార్లమెంటులో అతిపెద్ద కూటమిగా మారింది.

ఫ్రాన్స్‌లో మరైన్ లీపెన్ నాయకత్వంలోని మితవాద పార్టీ నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్) 31శాతం ఓట్లు దక్కించుకున్నది. ఇటలీలో ప్రధాని జార్జియా మెలోనికి చెందిన బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పార్టీ మెజార్టీ (మొత్తం ఓట్లలో నాల్గవ వంతు) ఓట్లు దక్కించుకుంది. పచ్చి మితవాదపార్టీలైన యూరోపియన్ కన్జర్వేటివ్స్ అండ్ రిఫార్మిస్ట్స్ (ఇసిఆర్), ఐడెంటిటీ అండ్ డెమోక్రసీ (ఐడి)ల కూటమి 131 సీట్లను నియంత్రించనున్నాయి.

ఆస్ట్రియాలో మితవాద పార్టీ అయిన 'ఫ్రీడం పార్టీ ఆఫ్ ఆస్ట్రియా' ఇటీవలి ఎన్నికలలో ముందంజలో ఉన్నది. ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డి) పార్టీ జర్మనీ ఎన్నికలలో ప్రతిసారీ తన బలం పెంచుకుంటూ వస్తుంది. యూరోపియన్ పార్లమెంటు ఎన్నికల్లో అది మంచి ప్రదర్శనను కనబర్చిన క్రమంలోనే జర్మనీలోని రెండు రాష్ట్రాల పార్లమెంటుల్లో కూడా ఇంతకుముందెన్నడూ లేనట్లుగా తొలిసారి మూడింట ఒక వంతుకు పైగా ఓట్లు సంపాదించింది. అన్ని కీలక అంశాలపై ప్రస్తుత ప్రభుత్వ పనితీరు నిరాశాజనకంగా ఉందని ప్రతి అయిదుగురిలో నలుగురు

జర్మన్లు భావిస్తున్నారు. వలసలు, ఆర్థిక విధానం వంటి కీలక సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించనందున ఈ ఎన్నికల తీర్పులు శిక్షగా ఉన్నాయి.

'డై లింకె' (వామపక్షం) పార్టీ నుండి చీలి కొత్తగా ఏర్పడిన 'సహ్రా వాగెక్నెట్ అలయన్స్' పార్టీ తొలిసారిగా ఎన్నికలలో పాల్గొని రెండంకెల శాతం ఓట్లు సాధించింది. కార్మికుల, నిరుద్యోగుల అందోళనలను దృష్టిలో పెట్టుకుని వలసదారుల పట్ల మరింత లోతైన విధానాన్ని అవలంభించింది. ఐరోపాలో ఎక్కువ మంది ప్రజలు కోరుకుంటున్నట్లుగా ఉక్రెయిన్లో యుద్ధాన్ని, దానికి నిరంతర ఆర్థిక సాయం అందించడాన్ని ఇది బహిరంగంగా వ్యతిరేకత ప్రకటించింది.

మొత్తంగా చూస్తే మితవాద పార్టీలు బలం పుంజుకుంటున్నాయి. ఐరోపాలో మధ్యేవాద పార్టీలు, గ్రీన్ పార్టీల ప్రజాపునాది కోల్పోవడం, చీలిపోవడాలు వంటి వాటితో మితవాద పార్టీలకు బలం పెరుగుతూ ఉండడాన్ని ఈ ఎన్నికలు ప్రతిబింబిస్తున్నాయి.

## ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికలు

తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో వామపక్ష సంకీర్ణం ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. జాలిక్ మిలాషన్‌కు చెందిన న్యూ పాపులర్ ఫ్రంట్ నాయకత్వంలో ఏర్పడిన ఈ సంకీర్ణం లీపెన్ నాయకత్వంలోని నేషనల్ ర్యాలీని వెనక్కు కొట్టింది. మితవాద శక్తులను ఎదిరించే పార్టీల మధ్యన వ్యూహాత్మక ఎన్నికల పొత్తులు, సంకీర్ణాల మూలంగా ఈ సానుకూల ఫలితాలు సాధ్యం అయ్యాయి. ఏ రాజకీయ పక్షానికి తగినంత మెజార్టీ రాని మూలంగా హంగ్ పార్లమెంట్ ఏర్పడింది. దీనిని ఆసరాగా తీసుకుని ఫ్రాన్స్ అధ్యక్షుడు మితవాద పార్టీ నుండి ప్రధాని పదవికి నామినేట్ చేయాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ పరిణామాలు భిన్న రాజకీయాల పార్టీ దిశను చూపిస్తున్నాయి.

## దక్షిణాఫ్రికా

వర్ణవివక్ష అనంతర చరిత్రలో జరిగిన ఎన్నికలలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) తొలిసారి మెజార్టీ కోల్పోయింది. దీంతో అనివార్యంగా

మధ్యేవాద, మితవాద పార్టీలైన డెమొక్రటిక్ అలయన్స్, ఇంకతా పార్టీ (ఐఎఫ్‌పి)లతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చింది. దక్షిణాఫ్రికాలో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులకు ఇది ఎదురుదెబ్బ. ఎఎన్‌సి, దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ, కొసాటు మూడు పక్షాలూ కలిసి పోటీ చేసినా ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత సంఖ్యలో సీట్లు గెలుచుకోలేకపోయాయి. గత రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అనుసరించిన ఆర్థిక విధానాల మూలంగా దేశీయ బూర్జువాలు లబ్ధి పొందారే తప్ప మెజార్టీ సామాన్య ప్రజానీకం జీవన ప్రమాణాలలో ఆశించిన మెరుగుదల లేకుండా పోయింది. ప్రజాగ్రహం ఈ ఎన్నికలలో ప్రతిబింబించింది.

## ఇంగ్లాండ్

లేబర్ పార్టీ మెజార్టీ సీట్లు సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తొలిసారిగా మితవాద పార్టీలు 14శాతం ఓటింగ్ సాధించాయి. పార్లమెంటులో కాలుమోపాయి. గత పద్నాలుగేళ్లు అధికారంలో ఉన్న కన్జర్వేటివ్ పార్టీ, ప్రతిపక్షంలో ఉన్న లేబర్ పార్టీలు అనుసరిస్తూ వచ్చిన ఆర్థిక విధానాల పట్ల ఉన్న ప్రజా వ్యతిరేకత మితవాద పార్టీలకు లాభించింది. ఈ కోణంలో పరిశీలించినప్పుడు ఈ సారి ఓటింగ్ లేబర్ పార్టీ పట్ల అనుకూలత కన్నా కన్జర్వేటివ్ పార్టీ పట్ల వ్యతిరేకత స్వభావం ఎక్కువగా కలిగి ఉంది. గాజాలో కాల్పుల విరమణను లేబర్ పార్టీ డిమాండ్ చేయడంలో విఫలం అవ్వడంతో ఆ పార్టీ సంప్రదాయ ఓటర్లు గణనీయంగానే లేబర్ పార్టీకి దూరమయ్యారు. జెర్మి కోర్బిన్ వంటి అనేక మంది వామపక్ష కార్మిక సంఘ నాయకులను లేబర్ పార్టీ బహిష్కరించడంతో వాళ్లు స్వతంత్ర అభ్యర్థులుగా నిలబడి గెలుపొందారు. లేబర్ పార్టీ పట్ల ప్రజా అసంతృప్తికి ఇది సంకేతం.

ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ప్రజాగ్రాహాన్ని సొమ్ముచేసుకుని మితవాద, అత్యంత మితవాద శక్తులు విజయాలు సాధించడమే కాకుండా ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నాయని ఈ ఎన్నికల ఫలితాలు చూపిస్తున్నాయి. అధికారాన్ని చేపట్టిన ఈ పార్టీలు నయాఉదారవాద విధానాలను అమలు చేయడమే కాకుండా, సామాజిక ఐక్యతను విచ్ఛిన్నం చేసే శక్తులను

పెంచి పోషిస్తాయి. ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్ ఈ దేశాలన్నింటా మనకు ఇదే ధోరణి కనిపిస్తుంది.

## నాటో 75వ వార్షికోత్సవం

2024 జులై 9-11 తేదీలలో నాటో 75వ వార్షికోత్సవ సందర్భంగా వాషింగ్టన్‌లో ఒక సదస్సు జరిగింది. ఈ సదస్సు చైనా - రష్యా దేశాల మధ్యన బలపడుతున్న మైత్రీ బంధం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా ప్రపంచాధిపత్యానికి చైనా సవాలుగా నిలిచిందని నాటో దేశాలు కూడా గుర్తించాయనే అంశాన్ని ఈ తీర్మానం తేటతెల్లం చేస్తుంది. చైనాపై దృష్టి అంటే, చైనా నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు, సమతుల్యతను సాధించే ప్రపంచ దేశాల భాగస్వామ్య ఒప్పందాలను పెంచడమే నాటో ఉద్దేశ్యమని అర్థమవుతోంది.

ఈ నేపథ్యంలోనే ఐరోపాయూనియన్ దేశాలతో పాటు ఇండో పసిఫిక్ ప్రాంతంలోని ఆస్ట్రేలియా, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా వంటి దేశాలతోనూ నాటో భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని నాటో సదస్సు నొక్కి చెప్పింది. చైనాను దృష్టిలో పెట్టుకునే, ది రిమ్ ఆఫ్ పసిఫిక్ (రిమ్‌ప్యాక్) పేరిట జులై నెల చివర్లో సముద్రజలాల్లో అతిపెద్ద మిలటరీ ప్రదర్శన సాగింది. ఈ ప్రదర్శనలో అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలు పాల్గొన్నాయి.

చైనా ఎగుమతుల మీద అమెరికా ఈ మధ్య కాలంలో ఆంక్షలు మరింత విస్తరించింది. సైనిక రక్షణ, సాంకేతిక పరిజ్ఞానాలు లక్ష్యంగా చేసుకుని సెమీకండక్టర్ల ఎగుమతులపై కఠిన నియంత్రణలు, కృత్రిమ మేధ చిప్స్‌పై కొత్తగా ఆంక్షలు విధించింది. అదే సమయంలో చైనా ఆర్థిక బలాన్ని అమెరికా పూర్తిగా విస్మరించలేనందున, అమెరికా–చైనా అత్యున్నత ప్రతినిధి బృందం మధ్య చర్చలను పున:ప్రారంభించేందుకు ఆసక్తిని చూపిస్తోంది. ఒకవైపు చైనా మీద ఒత్తిడిని పెంచుతూనే, మరోవైపు సహకారానికి ఉపయోగపడే మార్గాలను తెరిచి పెట్టడం అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వ్యూహ వైఖరిని స్పష్టం చేస్తోంది.

నాటో సదస్సులో భాగస్వామ్య దేశాలు కలిసి ఉక్రెయిన్‌కు మరింత ఆయుధ, ఆర్థిక సాయం అందచేస్తామని ప్రతిజ్ఞచేశాయి.

## అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ

గత రెండు దశాబ్దాలుగా కార్మిక ఆదాయాల వాటా (ఆర్థిక వ్యవస్థలో కార్మికులు సంపాదించిన మొత్తం ఆదాయాన్ని ఇది ప్రతిబింబిస్తుంది) క్రమేపి క్షీణిస్తూ రావడం కార్మికులపై దోపిడీ పెరిగిందనేందుకు నిదర్శనం. 2004 నాటికి ఉన్న కార్మిక ఆదాయాల వాటాకు, 2024 నాటి వాటాకు మధ్య తేడా 2.4 ట్రిలియన్ల అమెరికన్ డాలర్లుగా ఉన్నది. అంటే కార్మికులు ఈ మేరకు తమ ఆదాయాలు కోల్పోతే ఆ మేరకు యాజమాన్యాలు, పాలకవర్గాల సంపద పెరుగుతున్నది. నేడు ప్రపంచంలో తీవ్ర స్థాయిలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలకు ఇది నిదర్శనం.

ఉత్పత్తి ప్రక్రియలో క్రమేణా యాంత్రీకరణ పెరుగుతూపోవడం, ప్రతిఏటా శ్రామికశక్తి (నిరుద్యోగులు) సంఖ్య పెరుగుతూ ఉండడం వల్ల ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 28.2శాతం యువతులు 13.1శాతం మంది యువకులు నేడు నిరుద్యోగులుగా ఉన్నారు.

పెరుగుతున్న ద్రోవ్యోల్బణం, జీవనవ్యయాలు సాధారణ ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. ప్రభుత్వాలు చేపడుతున్న ద్రవ్య విధానాలు ఏవీ ప్రజలకు ఊరట కలిగించలేకపోతున్నాయి. ఆర్థిక సంక్షోభాలను సామాజిక అసమానతలను పరిష్కరించడంలో, రాజకీయ అవినీతిని అరికట్టడంలో, ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగానే కార్మికవర్గం పెద్ద ఎత్తున నిరసనలకు పూనుకుంటున్నది. మెరుగైన జీతభత్యాలు, పని భద్రతకోసం, ఆర్థిక సమానతలకోసం కార్మిక వర్గం పోరాటాలు చేస్తున్నది.

ఇంగ్లాండ్‌లో రాయల్ మెయిల్ కార్మికులు, దక్షిణాఫ్రికాలో గని కార్మికులు, అమెరికాలో హోటల్ కార్మికులు, ఫ్రాన్స్‌లో రవాణారంగ కార్మికులు, ఇటలీలో ఆరోగ్య సిబ్బంది, గ్రీస్‌లో నౌకాశ్రయ కార్మికులు ఆయా దేశాల్లోని ప్రభుత్వాలు చేపట్టిన పొదుపు చర్యల కారణంగా దెబ్బతింటున్న తమ జీవన ప్రమాణాలు కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున సమ్మెలు, పోరాటాలకు దిగారు. ఇదే సందర్భంలో నైజీరియా, లెబనాన్, శ్రీలంక, అర్జెంటీనా, ఈక్వెడార్ దేశాలలో ప్రజలపై భారాలు మోపుతున్న ఆర్థిక సంస్కరణలకు, ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా కార్మికులతో పాటు ఇతర తరగతుల వారు కూడా పెద్దఎత్తున ఉద్యమించారు.

## దక్షిణాసియా

దక్షిణాసియాలో భారీ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

**బంగ్లాదేశ్** లో విద్యార్థుల నాయకత్వంలో సాగిన ప్రజా ఉద్యమ తాకిడికి షేక్ హసీనా వాజెద్ నియంతృత్వ ప్రభుత్వం కూలిపోయింది. స్వాతంత్రోద్యమ కుటుంబ సభ్యులకు ఉపాధి, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రారంభమైంది. ఈ విద్యార్థి ఉద్యమంపై షేక్ హసీనా ప్రభుత్వం తీవ్రమైన అణిచివేతకు పాల్పడింది. పోలీసు కాల్పులలో వందలాది మంది మరణించారు. ఈ ఉద్యమాన్ని అణిచివేయడానికి షేక్ హసీనా ప్రభుత్వం సైన్యం సహాయం కోరింది. సైన్యం అందుకు నిరాకరించడంతో గత్యంతరం లేక హసీనా పారిపోయి మన దేశానికి వచ్చింది.

మహమ్మద్ యూనస్ నాయకత్వాన ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వం సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు, ఎన్నికలు నిర్వహించి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని నెలకొల్పేదానికి కృషి చేస్తున్నది. అయితే అవామీలీగ్ దాని మిత్ర పక్షాలను ఎన్నికలలో పాల్గొననీయకుండా చేయడానికి మధ్యంతర ప్రభుత్వం రాజ్యాంగేతర పద్ధతులను ఎంచుకుంటున్నదనే అభిప్రాయం కూడా బలంగా ఉంది. ఇలాంటి సంక్షుభిత వాతావరణంలో అంతర్జాతీయ సంబంధాలు ఉన్న కొన్ని ఇస్లాం, ఛాందస శక్తులు మతపరమైన విభజన సృష్టించడానికి హిందూ మైనార్టీలపై దాడులకు పూనుకున్నాయి. చిట్టగాంగ్ పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న చక్మాలు, తదితర గిరిజన తెగలపై ఇలాంటి దాడులు జరిగినట్లు వార్తలు అందుతున్నాయి.

ఇటువంటి పరిస్థితులను అడ్డుగా పెట్టుకుని అమెరికా తదితర పశ్చిమ దేశాల కూటమి తమ స్వార్థ ప్రయోజనాల కోసం పావులు కదిపే అవకాశం ఎంతైనా ఉన్నది. విద్యార్థి నాయకత్వం దృక్పథం ప్రస్తుతం ప్రజాస్వామికం, లౌకికత్వంతో కూడుకుని ఉన్నది. అయితే భవిష్యత్తు రాజకీయాలకు ఒక రూపాన్ని ఇవ్వడంలో ఇది ఏ మేరకు, ఎలాంటి పాత్ర పోషిస్తుందనేది వేచి చూడాల్సిందే.

**శ్రీలంక**లో సెప్టెంబర్ 21న జరిగిన అధ్యక్ష ఎన్నికలలో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) సంకీర్ణ కూటమి నాయకుడు అసుర దిసనాయకే ఘన విజయం

సాధించాడు. జనతా విముక్తి పెరుమన పార్టీ ఈ సంకీర్ణంలో భాగస్వామి. అసుర దిసనాయకే ఈ పార్టీకి చెందిన నాయకుడు. ఇది ఒక చారిత్రక విజయం. శ్రీలంకలో తొలిసారిగా వామపక్ష అభ్యర్థి దేశాధ్యక్ష పదవికి ఎన్నికయ్యాడు.

శ్రీలంకలో ఇప్పటి వరకూ అధికారం చెలాయించిన అధికార, ప్రతిపక్ష పార్టీల అవినీతి పరిపాలనతో జనం విసిగిపోయారు. దిసనాయకే పార్లమెంటును రద్దుచేశాడు. పార్లమెంటులో ఎన్‌పిపి సరిపడ బలం సమకూర్చుకునేందుకు అనువుగా నవంబరులో ఎన్నికలు జరపనున్నారు. ఎన్‌పిపికి చెందిన విద్యావేత్త హరిణి అమరసూరియను ప్రధానిగా నియమించాడు. ప్రజల మీద పెను భారాలకు కారణమైన ఐఎంఎఫ్ అప్పుకు సంబంధించిన షరతులను పున:పరిశీలించడం కొత్త ప్రభుత్వం ముందున్న పెనుసవాలు. అలాగే తమిళులు అధికంగా ఉన్న శ్రీలంక తూర్పు, ఉత్తర ప్రాంతాలకు ఏ మేరకు పాలనాధికారాలు ఇవ్వాలనేది కూడా అధ్యక్షుడి ముందు ఉన్న మరో కీలక సమస్య.

# జాతీయం

మూడవ దఫా కేంద్రంలో అధికారం చేపట్టిన మోడి ప్రభుత్వ వందరోజుల పాలన బిజెపి అనుసరించే మౌలిక విధానాలకు, దిశకు భిన్నంగా ఉండదని స్పష్టంగా కన్పడుతున్నది. కేంద్ర బడ్జెట్ గానీ, ఇతర ఆర్థిక వ్యవహారాలు గానీ ఈ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాలకే కట్టుబడి ఉందని స్పష్టం చేస్తున్నాయి. కొత్తగా చేసిన మూడు క్రిమినల్ చట్టాలు, కేంద్ర ఏజెన్సీలను ఉపయోగపెట్టుకుని ప్రతిపక్ష రాజకీయ నాయకులపై వేధింపులకు దిగడం వంటి వాటితో బిజెపి తన పాత నియంతృత్వ పద్ధతులనే కొనసాగించదలిచింది అని స్పష్టం అవుతున్నది. బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాల పట్ల మోడీ సర్కారు పక్షపాతంతో వ్యవహరిస్తున్నది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనారిటీ వ్యతిరేక చట్టాలను అమలులోకి తీసుకురావడంతో పాటు మైనార్టీలపై దాడులు కూడా పెరుగుతున్నాయి. విదేశాంగ విధానం విషయానికి వస్తే మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాద అమెరికాతో మరింతగా అంటకాగేందుకు సిద్ధపడుతుందని స్పష్టమవుతున్నది.

## కేంద్రబడ్జెట్

మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఎలాంటి ఉపశమనంగానీ ఊరటగానీ కలిగించలేదు. ఆహారపదార్థాల ద్రవ్యోల్బణం రేటును, నిరుద్యోగాన్ని, ఆర్థిక అసమానతలను తగ్గించడానికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఆర్థిక కార్యకలాపాలు ముమ్మరం చేయడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. కానీ మోడీ ప్రభుత్వం అన్నింటా కోతలకు పూనుకున్నది. ఎరువుల సబ్సిడీలో రూ. 24,894 కోట్లు, ఆహార సబ్సిడీలో రూ. 7082కోట్లు కోత విధించింది. విద్య, వైద్యం గ్రామీణాభివృద్ధి రంగాలకు చేసిన కేటాయింపులు గతంలో స్థూల జాతీయోత్పత్తిలో ఎంత శాతంగా ఉన్నాయో దాదాపు అలానే ఉన్నాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ. 86వేల కోట్లు కేటాయించింది. ఇది ఈ పథకం కింద నిరుటి ఏడాదిలో చేసిన ఖర్చు కన్నా చాలా తక్కువగా ఉంది. గ్రామీణ భారతదేశంలో నెలకొని ఉన్న నిరుద్యోగ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఈ నిధులు ఎంత మాత్రం సరిపోవు.

ఉపాధి కల్పనా ప్రోత్సాహకాల పేరిట మోడీ ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి మరింత సొమ్ము దోచిపెట్టడానికి సిద్ధపడింది. ఈ పథకం ద్వారా శాశ్వత ఉద్యోగితను దెబ్బకొట్టి నియమిత కాల అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి మార్గం సుగమం చేసింది. రాష్ట్రాలకు చేయాల్సిన అభివృద్ధి నిధుల కేటాయింపులను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించింది. అలాగే ఫైనాన్స్‌కమిషన్ రాష్ట్రాలకు కేటాయించే గ్రాంట్‌లలో కోత పెట్టింది. పేదలను మరింత పేదలుగానూ, సంపన్నులను మరింత సంపన్నులుగానూ చేసే బడ్జెట్‌గా చెప్పొచ్చు. ఫెడరల్ స్ఫూర్తిని తీవ్రంగా దెబ్బతీస్తుందీ బడ్జెట్.

## భారత ఆర్థిక వ్యవస్థ

స్థూల జాతీయోత్పత్తి 2024-25 తొలి త్రైమాసికంలో 6.7శాతానికి పడిపోయింది. 2023-24 తొలి త్రైమాసికంలో 8.2శాతంగానూ, చివరి త్రైమాసికంలో 7.8 శాతంగానూ ఉన్న జిడిపి కన్నా తక్కువ ఇది. మొదటి

త్రైమాసికంలో ప్రభుత్వం చేసిన తుది ఖర్చులో 0.2 శాతం కోత రూపంలో జిడిపి తగ్గుదల ప్రభావం ప్రతిబింబిస్తోంది.

2024 ఆగస్టు నాటికి వినిమయ ధరల సూచీ(సిపిఐ)ని అనుసరించి ద్రవ్యోల్బణ రేటు 3.65 శాతంగా ఉందని నివేదికలు వెలువడ్డాయి. ఆహార ద్రవ్యోల్బణం ముఖ్యంగా కాయగూరలు, చిరుధాన్యాల వంటి నిత్యావసరాల ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి.

## నిరుద్యోగం

2024 సెప్టెంబరు నాటికి నిరుద్యోగ రేటు 9.2 శాతానికి చేరుకున్నది. ఇది సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సిఎంఐఇ) వెలువరించిన గణాంకాలు. 2024 మే నెలలో ఇది 7 శాతంగా మాత్రమే ఉండేది. గ్రామీణ ప్రాంత నిరుద్యోగిత 9.3శాతం ఉండగా పట్టణ ప్రాంత నిరుద్యోగిత 8.9 శాతంగా నమోదయ్యింది. మహిళా నిరుద్యోగ శాతం గణనీయంగా 18.5 శాతంగా ఉన్నది.

కానీ మోడీ ప్రభుత్వం మాత్రం నిరుద్యోగం తగ్గుముఖం పట్టిందంటూ ప్రచారం చేసుకుంటున్నది. ప్రస్తుతానికి నిరుద్యోగిత 3.2 శాతం మాత్రమే అని నిర్లజ్జగా ప్రకటించింది. బిజెపి అధికారం చేపట్టాక ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ సర్వేలలో ఉద్యోగ నిర్వచనాన్నే మార్చి పడేసింది. ఇప్పుడు అధికారికంగా నిర్వహించిన పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్)లో వ్యవసాయంలో జీతభత్యాలు లేని పార్ట్‌టైమ్ హెల్పర్స్‌ని కూడా ఉద్యోగుస్థులుగా పరిణనలోకి తీసుకుంటున్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలో నికరంగా జీతం వచ్చే ఉద్యోగాలు, స్వయం ఉపాధి రంగాల్లో ఉద్యోగాలు పెరగడం లేదు.

## పెట్రోల్ డీజిల్ ధరలు

అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్ ఒక్కింటికి 89.40 డాలర్ల నుండి 73.59 డాలర్లకు తగ్గింది. దాదాపు 18శాతం ధర తగ్గింది. మార్కెట్ మెకానిజం పేరిట దిగుమతి చేసుకునే ముడి చమురు ధర పెరిగినప్పుడల్లా

మన దేశంలోని చమురు ఉత్పత్తి కంపెనీలకు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుకునే హక్కులు ప్రభుత్వం కల్పించింది. దిగుమతుల ధరలు పెరిగినప్పుడల్లా చమురు కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేస్తూ పోతున్నాయి కదా! మరి ముడి చమురు ధర గణనీయంగా తగ్గినప్పుడు ఆ మేరకు పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి కదా! కానీ గత ఆరు నెలలుగా మోడీ హయాంలో చమురు కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్క రూపాయి కూడా తగ్గించలేదు. అంటే ప్రభుత్వం జనాల జేబులు కొట్టి లాభపడుతుంది. ప్రభుత్వం చేస్తున్న ఈ మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లి పెట్రోల్, డీజిల్ ధరల తగ్గించాలని డిమాండు చేసేలా ప్రజాభిప్రాయాన్ని మలచాలి.

## ఆర్థిక సమాఖ్య సదస్సు

కేరళ ఎల్డీఎఫ్ ప్రభుత్వం సెప్టెంబరు 12న తిరువనంతపురంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు ఐదు రాష్ట్రాల – కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, పంజాబ్, కేరళ –ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. 'డివిజబుల్ పూల్' నుండి ఏ నిష్పత్తిలో నిధులు పంచుకోవాలి అనేది 16వ ఫైనాన్స్ కమిషన్ నిర్ణయించనున్న నేపథ్యంలో సదస్సు ప్రధానంగా ఆ అంశం మీద చర్చలు కేంద్రీకరించింది. రాజకీయ కారణాలతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు నిధుల కేటాయింపులలో అన్యాయానికి పాల్పడుతోందని సదస్సు అభిప్రాయపడింది. మెరుగైన పనితీరుతో సంపద సృష్టిస్తున్న రాష్ట్రాల పట్ల గత దశాబ్ద కాలంగా తీవ్ర వివక్షతతో వ్యవహరించిందని విమర్శించింది. నిధుల పంపిణీలో సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించేలా 16వ ఫైనాన్స్ కమిషన్ ముందు ఐక్యంగా తమ వాదనలు ఉంచాలని సదస్సు నిర్ణయించింది.

రాష్ట్రాలకు సరైన న్యాయం జరగాలంటే ప్రస్తుతం ఇస్తున్న 42 శాతం వాటాకు బదులుగా 50 శాతం వాటా ఇవ్వాలని, ఆ మేరకు కేంద్రాన్ని కోరాలని నిర్ణయించింది. సమాఖ్య స్ఫూర్తిని నిలబెట్టుకునేదానికి ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ట్రాలు అన్నింటినీ ఒక వేదిక మీదకు తీసుకు రావాలని సదస్సు నిర్ణయించింది.

## నూతన నేర చట్టాలు

2024 జులై 1 నుండి నూతన నేర చట్టాలు అమలులోకి వచ్చాయి. ఈ చట్టాలను ఎటువంటి చర్చ లేకుండా, హడావుడిగా, మెజార్టీ ప్రతిపక్ష సభ్యులను పార్లమెంటు నుండి బహిష్కరించి, దుర్మార్గపూరితమైన పద్ధతుల్లో మోడీ ప్రభుత్వం ఆమోదింప చేసుకున్నది. ఇవి అప్రజాస్వామిక, నియంతృత్వ చట్టాలు. అత్యంత క్రూర స్వభావం కలిగినవి.

భారత శిక్షా స్మృతి (ఐపిసి)లో 'రాజద్రోహ నేరం' మోపడానికి ఉద్దేశించిన సెక్షన్ 124'ఎ' ను సుప్రీంకోర్టు సరిగ్గానే కొట్టేసింది. అయితే దీనిని కొత్తగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహితలో 152వ సెక్షను కిందకి మోదీ ప్రభుత్వం చేర్చింది. సెక్షన్ 124 'ఎ' లో లేని దేశ సమగ్రత, సార్వభౌమాధికారం అన్న అంశాలను కూడా చొప్పించారు. ఇది సుప్రీంకోర్టు తీర్పును పూర్వపక్షం చేయడమే కాదు, దేశంలోని ఏ పౌరుడి మీద అయినా దేశద్రోహ ముద్ర వేయడానికి పాలకులకు అవకాశం కల్పిస్తుంది.

ఈ చట్టాల్లోని అనేక క్లాజులు పోలీసులకు అపరిమితమైన అధికారాలు కట్టబెట్టేవిగానూ, సామాన్య ప్రజల పౌరహక్కులకు భంగం కలిగించే రీతిలోనూ ఉన్నాయి. ఉదాహరణకు గత చట్టాల్లో పోలీసులు ఏ వ్యక్తినీ 15 రోజులకు మించి నిర్బంధంలో ఉంచకూడదని స్పష్టం చేస్తుంది. కానీ కొత్త చట్టంలో ఆ పరిమితిని తొలగించారు. న్యాయమూర్తులు ముద్దాయిలను ఎవరినైనా 90 రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇచ్చే అవకాశం కొత్త చట్టంలో పొందుపరిచారు. నేరం జరిగిన తరువాత లేదా అరెస్టు చేసిన తరువాత పోలీసు అధికారి 15 రోజుల వరకు విచారించి ఆ తరువాత ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చు.

గతంలో ఉపా చట్టం కింద నేరం ఆరోపించి అరెస్టు చేసిన వారిని పోలీసు ఉన్నతాధికారులు మాత్రమే విచారించాలన్న నిబంధన ఉండేది. కొత్త చట్టంలోని 152వ సెక్షన్ కింద స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (సిఐ ఎస్ ఐ)లకు అటువంటి విచారణాధికారం దాఖలు పడింది. పాత చట్టాన్ని అనుసరించి ఉపా నేరం ఆరోపించబడిన వారిని ఎవరు విచారించాలి అనేది ప్రభుత్వం నిర్ణయించి

అనుమతించాలి. కానీ కొత్త చట్టం ప్రకారం 'ఉగ్రవాద' నేరాలను కూడా సాధారణ పోలీసులు విచారించవచ్చు. 'ఎవరైనా నేరం చేస్తే ఆ సమయానికి అది నేర నిర్వచన పరిధిలోకి వస్తే తప్ప అతనిని/ఆమెను శిక్షించడానికి వీలు లేదు.' అనేది చట్టంలోని మౌలిక సూత్రం.

కొత్త చట్టాలను అనుసరించి జులై 1 కన్నా ముందు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లకు జులై 1 కన్నా ముందు అమలులో ఉన్న చట్టాలు వర్తిస్తాయి. జులై 1 తరువాత నమోదయిన ఎఫ్ఐఆర్‌లకు కొత్త చట్టాలు వర్తిస్తాయి. ఈ రకంగా రెండు చట్టాలూ సమాంతరంగా అమలు చెయ్యాల్సి రావడం అనేక వివాదాలకు దారితీస్తుంది. అప్పీలు చేసుకోవడం కూడా మరింత సంక్లిష్టంగా మారనున్నది. కొత్తగా తీసుకు వచ్చిన చట్టాల్లో అనేక అసందిగ్ధతలు, అస్పష్టతలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో పెండింగ్‌లో ఉన్న లక్షలాది కేసుల పరిష్కారంలో మరింత జాప్యానికే ఇది దారి తీస్తుంది.

అందుకే ఈ చట్టాల పట్ల వ్యతిరేకతను వెల్లడించిన బార్ అసోసియేషన్లు, పౌర సంఘాల ఆందోళనకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మద్దతు ప్రకటించింది. కొత్త చట్టాల అమలును నిలుపుదల చెయ్యాలని డిమాండ్ చేసింది.

## వెనుకంజ

కేంద్రంలోని భాజాపా ప్రభుత్వం సంకీర్ణ పార్టీల మద్దతు మీద ఆధారపడి మనుగడ సాగిస్తోందన్న స్పృహలేకుండా పార్లమెంటును తన ఇష్టారాజ్యంగా నడపడానికి ప్రయత్నిస్తున్నది. అనేక చట్టాలను మూకబలంతో నెగ్గించుకోవడానికి ప్రయత్నించింది. కానీ పార్లమెంటు సాంప్రదాయాలు అనుసరించకుండా తీసుకురావాలని చూసిన వివిధ చట్టాలను ప్రతిపక్ష పార్టీల అభ్యంతరాల మధ్యన బలవంతాన వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది.

**1. పక్కదోవ నియామకాలు :** కేంద్ర ప్రభుత్వంలో సహాయ కార్యదర్శి నియామకాలను యుపిఎస్‌సి పరీక్షల ద్వారా కాకుండా నేరుగా చేపట్టడానికి ఒక ప్రకటన జారీ చేసింది. రాత పరీక్షల ద్వారా నియామకాలలో ఎస్సీ, ఎస్టీ, ఓబిసి రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. అవి లేకుండా చెయ్యాలనే దురుద్దేశంతోనే

ఇలా పక్కదోవన నియామకాలకు పూనుకుంటున్నారని ప్రతిపక్షాలు అభ్యంతరం చెప్పడంతో ప్రభుత్వం ఈ నియామక ప్రకటనను వెనక్కు తీసుకున్నది.

**2. ముసాయిదా బ్రాడ్ కాస్టింగ్ బిల్లు :** కేబుల్ నెట్ వర్క్ చట్టం స్థానంలో మోడీ ప్రభుత్వం బ్రాడ్ కాస్టింగ్ సర్వీసెస్ (రెగ్యులేషన్) చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నించింది. అయితే ఈ ముసాయిదా బిల్లును రూపొందించే క్రమంలో ప్రభుత్వం కొన్ని మీడియా సంస్థలతో చేపట్టిన చర్చల పట్ల ప్రతిపక్షాలు అభ్యంతరం చెప్పడంతో ప్రభుత్వం ఈ ముసాయిదా బిల్లును వాపసు తీసుకుంటున్నామని, మార్పులు చేర్పులతో మరోసారి పార్లమెంటు ఆమోదం కోసం ఉంచుతామని ప్రకటించింది.

**3. వక్ఫ్ బిల్లు**: మోడీ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి కొన్ని సవరణలతో కొత్త బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ప్రతిపక్షాల నుండి మాత్రమే కాకుండా బిజెపి సంకీర్ణ పక్షాల నుండి కూడా వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించింది.

## మతపరమైన విభజన కోసం దుందుడుకు చర్యలు :

2024 సార్వత్రిక ఎన్నికలలో బిజెపి అనూహ్యంగా దెబ్బతినడంతో ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో హిందూత్వ శక్తులు ముస్లిం వ్యతిరేకత కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వాలు కన్వర్‌యాత్ర సందర్భంగా షాపుల వాళ్లు, వీధుల వెంబడి అమ్ముకునే వాళ్లు తమ పేర్లను తెలిపే బోర్డులను తగిలించాలని ఆదేశాలు జారీ చేశారు. యాత్ర పొడుగునా ముస్లింలకు చెందిన షాపుల విధ్వంసానికి పన్నిన కుట్ర ఇది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఈ ఆదేశాలు అమలు కాకుండా చూసింది.

ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాలో గోరక్షక దళాల దాడులు చోటు చేసుకున్నాయి. హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాలో అనధికారిక కట్టడం పేరిట మసీదును విధ్వంసం చేయాలనే ఆందోళన రేపాయి హిందూత్వ శక్తులు. ఇతర జిల్లాలో కూడా ఇలాంటి సమస్యల మీద ఉద్రికత్తలు రెచ్చగొట్టడానికి

ప్రయత్నిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లో ముస్లిం వ్యాపారస్థుల, షాపు యజమానుల వ్యాపారాలను బహిష్కరించాలని పిలుపునిచ్చాయి. కొన్ని గ్రామాల సరిహద్దులలో ముస్లింలకు 'ప్రవేశం లేదు' అన్న బోర్డులు పెట్టారు.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకమైన మతమార్పిడి (సవరణ) బిల్లు 2024ను తీసుకువచ్చింది. మతాంతర వివాహాలను నిరోధించడానికి ఉద్దేశించిన ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమైనది. మతాంతర వివాహాలు చేసుకున్న వారికి గతంలో పదేళ్ల జైలు శిక్ష విధించవచ్చు అని ఉన్న క్లాజును యావజ్జీవ శిక్షగా మార్చారు.

అసోం ప్రభుత్వం 'ల్యాండ్ జిహాద్'ను అరికట్టే పేరిట హిందూ, ముస్లింల మధ్యన భూ అమ్మకాలను నిరోధించే చట్టం తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. అటువంటి లావాదేవీలకు ముఖ్యమంత్రి ఆమోదం ఉండి తీరాలని ఒక నిబంధన తీసుకువచ్చారు. మతాంతర వివాహాలకు పాల్పడిన వారిని శిక్షించడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేసిన చట్టాన్ని పోలిన చట్టం తీసుకువస్తానని ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ స్వయంగా ప్రకటించాడు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూ ముఖ్యమంత్రి ముస్లింలు 'బయటివారని, 'మియా ముస్లిం'ల నియంత్రణలోకి రానివ్వబోమంటూ విద్వేష భాషలో ప్రకటిస్తున్నాడు.

మహారాష్ట్ర ప్రభుత్వం 'అర్బన్ నక్సలిజాన్ని' అణిచివేసే పేరిట 'ఉపా'చట్టం కన్నా దుర్మార్గమయిన 'మహారాష్ట్ర ప్రత్యేక ప్రజా రక్షణ బిల్లు'ను తీసుకువచ్చింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకుని మతపరమైన విభజనను తీవ్రతరం చేసి రాజకీయ లబ్ధి పొందడానికి బిజెపి ప్రయత్నిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో కల్తీ జరిగింది అనే పేరుతో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలయిన టిడిపి – జనసేన – బీజేపీలు ఈ వివాదానికి మతం రంగు పులమడానికి ప్రయత్నించాయి. మత విశ్వాసాలను రెచ్చగొట్టేదానికి ఈ మూడు పార్టీలు ఒక దానిని మించి మరొకటి పోటీ పడ్డాయి.

## ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు

షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లలో వర్గీకరణ అమలు చెయ్యాలని ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. స్పష్టమైన మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేపట్టాలని ఆదేశాలు ఇచ్చింది. ఎస్సీలలో కొన్ని ఉపకులాలు సామాజికంగా, ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నాయన్న నిర్దిష్టమైన గణాంకాల ఆధారంగా మార్క్సిస్టుపార్టీ ఈ వర్గీకరణ డిమాండును బలపరిచింది. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో మాదిగలు, తమిళనాడులో అరుంధతీయులు వర్గీకరణ కోరుతున్నారు. అయితే సుప్రీంకోర్టు తీర్పును కొన్ని రాజకీయపార్టీలు, ప్రధానమైన దళిత సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

ఏడుగురు సభ్యుల ధర్మాసనంలో నలుగురు సభ్యులు విడిగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో 'క్రీమీలేయర్'ను వర్తింప చేయాలని సూచించడం వివాదాస్పదంగా మారింది. ఇది ఈ నలుగురు న్యాయమూర్తుల అభిప్రాయంగా నమోదు చేయబడిందే గానీ తీర్పులోని ఆదేశాల్లో భాగం కాదు. అయినా ఈ క్రీమీలేయర్ ప్రతిపాదన వల్ల తీర్పుపై మరింత వ్యతిరేకత పెంచింది. ఈ విషయంలో పార్టీ తన వైఖరిని స్పష్టం చేసింది. వర్గీకరణకు పార్టీ అనుకూలం. కానీ క్రీమీలేయర్ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ప్రతిపాదనను అమలు చేయబోమని స్పష్టంగా ప్రకటించాల్సి వచ్చింది.

## ఒకే దేశం ఒకే ఎన్నిక

మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికలకు ముందే తాను ప్రకటించిన అంశాలను అమలు చేస్తున్నానని చూపించడంలో భాగంగా 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' సాధ్యాసాధ్యాలపై నియమించిన రామ్ నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులను మోడీ మంత్రివర్గం ఆమోదించింది. దేశవ్యాప్తంగా పార్లమెంటుకు, అసెంబ్లీలకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నిక జరపాలని కోవింద్ కమిటీ సిఫార్సు చేసింది. ఒకే దేశం, ఒకే ఎన్నిక అనేది మన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థకు రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగిస్తుంది. పార్లమెంటుకు, శాసన సభలకు రాజ్యాంగం నిర్దేశించిన అయిదేళ్ల

కాలపరిమితిని కాలరాస్తుంది. ఈ కేంద్రీకృత ఏకీకృత విధానం మూలంగా ఏమేం నష్టాలు వాటిల్లుతాయో పార్టీ ఇంతకుముందే స్పష్టం చేసింది.

ఈ విధానాన్ని అమలులోకి తీసుకురావాలంటే రాజ్యాంగానికి అనేక సవరణలు చేయాలి. కానీ మోడీ ప్రభుత్వానికి లోక్‌సభలో గానీ, రాజ్యసభలో గానీ అందుకు అవసరమైన మూడింట రెండువంతుల మెజార్టీ లేదు. ప్రధాని మోడీ స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో అన్ని రాజకీయ పక్షాలూ ఈ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వాలని కోరాడు. ఇదంతా ఈ డిమాండును ప్రజలలో నాన్చి నాన్చి మద్దతు కూడగట్టడానికి చేసే ప్రయత్నమే.

ఒకే దేశం, ఒకే ఎన్నిక అప్రజాస్వామికం. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. అంతే కాదు నియతృత్వ రాజ్యాన్ని స్థాపించడమే ఈ ప్రతిపాదన వెనుక ఉద్దేశం అని మన పార్టీ శ్రేణులు ప్రజలకు పెద్ద ఎత్తున వివరించాలి.

## మణిపూర్ పరిస్థితి

గత కొద్దివారాలలో మణిపూర్ లో పరిస్థితులు చాలా దారుణంగా దిగజారాయి. లోయకు ఆనుకుని ఉన్న కొండప్రాంత జిల్లాల సరిహద్దులలో దాడులు పెరిగాయి. ఈ ఘర్షణలలో ఇరువైపులా ఎనిమిది మంది మరణించారు. మెయితీలు అత్యధికంగా ఉన్న జిల్లాలతో పాటు రాజధాని పట్టణమైన ఇంఫాల్ లో విద్యార్థులు నిరసన ప్రదర్శనకు పూనుకున్నారు. భద్రతా సలహాదారును, డిజిపిని ఆయా పదవుల నుండి తొలగించాలని విద్యార్థులు ఆందోళనకు పూనుకున్నారు. కుకీ మిలిటెంట్లతో కుదుర్చుకున్న సంధి ఒప్పందాన్ని రద్దు చేయాలని, సైన్యంలోని అస్సాం రైఫిల్స్ విభాగం నేతృత్వంలో ఉన్న ఏకీకృత కమాండ్ కంట్రోల్‌ను రాష్ట్రప్రభుత్వ పరం చేయాలని వాళ్లు డిమాండు చేస్తున్నారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కూడా ఈ డిమాండుకు మద్ధతు పలికారు. గత 16 నెలలుగా మణిపూర్‌లో హింస ప్రజ్వరిల్లుతూనే ఉంది. 60వేల మంది జనాభా శరణార్థి శిబిరాలలో తలదాచుకున్నారు.

మౌలికాంశాల పరిష్కారం కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్న భాజపా ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవ్వడం వల్ల జాతి వైషమ్యాలకు దారి తీసి విభజన

మరింత ఘనీభవించేందుకు దారి తీసింది. మెయితీల ఆధిపత్య లోయకు, కుకీల ఆధిపత్య కొండ ప్రాంతాలకు మధ్య ఉన్న బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసేందుకు 60 వేల మంది కేంద్ర పోలీసు బలగాలను మోహరించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న బీరేన్‌సింగ్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ, మెయితీ ఉగ్రవాద మూకలను ప్రోత్సహించడం కూడా సమస్యలో ఒక భాగం. ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ అనుసరిస్తున్న పక్షపాత ధోరణుల గురించి తెలిసి కూడా మోడీ ప్రభుత్వం, బిజెపి కేంద్ర నాయకత్వం ఆయనకే దన్నుగా నిలుస్తున్నాయి. గత పదహారు నెలల్లో ఒక్కసారి కూడా ప్రధాని హోదాలో నరేంద్రమోడీ ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌ను సందర్శించాలని భావించలేదు. కేంద్రప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తోందనడానికి ఇది స్పష్టమైన తార్కాణం.

కేంద్రప్రభుత్వం సత్వరమే జోక్యం చేసుకుని ప్రధాన జాతులతో రాజకీయ చర్చల ప్రక్రియను ప్రారంభించకపోతే అన్ని వర్గాల పౌరుల హక్కులను పరిరక్షించడంతో పాటు, రాష్ట్రంలో శాంతి భద్రతల స్థాపన సాధ్యం కాదు.

## పశ్చిమబెంగాల్‌లో పెల్లుబికిన ప్రజాగ్రహం

ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీ అండ్ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్న వైద్య విద్యార్థిని మాన భంగానికి గురై హత్యకావించబడిన దుర్మార్గాన్ని నిరసిస్తూ కలకత్తా ప్రజానీకం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలకు పూనుకున్నారు. ఈ నిరసనలు రాష్ట్రంలోని అన్ని నగరాలు, ముఖ్య పట్టణాలకు విస్తరించాయి. వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం పెద్ద పెట్టున వీధుల్లోకి వచ్చారు. ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి పూట లక్షలాది మంది మహిళలు వీధుల్లోకి వచ్చి 'రీక్లెయిమ్ ది నైట్' (రాత్రిని తిరిగి పొందడం) పేరిట, రాత్రిపూట ఎలాంటి లైంగిక వేధింపులు, దాడులు లేకుండా స్వేచ్ఛగా తిరుగాడడానికి తమకు ఉన్న హక్కును పునరుద్ఘాటించారు. ఇదొక చారిత్రాత్మక ఘట్టం. పట్టణం, పల్లెలు అని తేడా లేకుండా పేదలు, మధ్య తరగతికి చెందిన మహిళలు ఏకోన్ముఖంగా కదిలిన సందర్భం ఇది.

ఈ నిరసన ప్రదర్శనలు ఆకస్మికంగా సహజసిద్ధంగా జరగడంతో ఎక్కడా పార్టీ జెండాలు ప్రదర్శించలేదు. కానీ ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతంగా సాగడానికి పార్టీ, వామపక్ష ఫ్రంట్ స్వతంత్రంగా అన్ని విధాలా తోడ్పడింది.

ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన ఈ ఘాతుకానికి నిరసనగా దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థిలోకం, వైద్యుల అసోసియేషన్లు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పని ప్రదేశంలో మహిళలకు రక్షణ కల్పించడానికి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జూనియర్ వైద్యులు ఒక రోజు సమ్మె చేశారు.

రాష్ట్రంలో ఆరోగ్య రంగంతో పాటు, అన్ని రంగాల్లోకి దూసుకుపోతున్న పాలకపార్టీ – నేరమయ శక్తులకు ఉన్న మధ్య ఉన్న అనుబంధానికి వ్యతిరేకంగా ఉద్యమం సాగుతోంది. మమతాబెనర్జీ, టిఎంసి ప్రభుత్వం ప్రతిష్ట మసకబారింది. అనేక తరగతుల ప్రజానీకం విశ్వాసం కూడా కోల్పోయింది.

## కార్మికవర్గ వ్యతిరేక చర్యలు

మోడీ ప్రభుత్వం మూడు లేబర్ కోడ్ లకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసే దిశగా ముందుకు కదులుతోంది. ఇందుకు అనుగుణంగా కార్మిక చట్టాలలో మార్పులు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి కూడా పెంచుతోంది. ఇందుకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు సెప్టెంబర్ 23ను బ్లాక్ డే (చీకటిరోజు)గా పాటించాయి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పని గంటల పరిమితిని 12 గంటలకు పెంచుతూ నోటిఫికేషన్లు జారీ చేశాయి. తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలు ఇలాంటి నోటిఫికేషన్లు ఇచ్చాయి.

కార్పొరేట్ ఆఫీసుల్లో పనిచేసే ఉద్యోగుల మీద ఇప్పటికే ఉన్న పనిభారం వారిని తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తుంది. పని ఒత్తిడి మూలంగా అనేక మంది ఉద్యోగులు హఠాన్మరణం పాలయిన వార్తలు అనేకం మనం చూస్తున్నాం. ఈ మధ్యనే ఎర్నెస్ట్ అండ్ యంగ్ అనే అంతర్జాతీయ అకౌంటింగ్ సంస్థలో మహిళా

ఉద్యోగి పని ఒత్తిడి కారణంగా మరణించారు. ఈ సంఘటన కార్పొరేట్ కంపెనీల్లో యువ నిపుణులు, ఉద్యోగులు దోపిడీకి గురవుతున్న తీరుకు నిలువెత్తు నిదర్శనం.

తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో ఉన్న సామ్‌సంగ్ ప్లాంట్ కార్మికులు తమకు నచ్చిన యూనియన్ పెట్టుకునే హక్కు కోసం నిరవధిక సమ్మెకు దిగారు. ఈ బహుళజాతి కంపెనీ యూనియన్‌పెట్టుకునే కార్మికుల హక్కును నిరాకరిస్తుంది. కార్మికులు యూనియన్ రిజిస్ట్రేషన్ కోసం పెట్టుకున్న దరఖాస్తును లేబర్ డిపార్ట్‌మెంట్ ఆమోదించలేదంటే ఆ కంపెనీ మన చట్ట వ్యవస్థల మీద ఎంత పట్టు సంపాదించిందో అర్థం చేసుకోవచ్చు. కార్మికులకు సంఘం పెట్టుకునే ప్రాథమిక హక్కును, భారత దేశ చట్టాలను ఒక బహుళజాతి కంపెనీ ఉల్లంఘించడాన్ని అనుమతించరాదు.

లాభాలార్జిస్తూ 'మినీరత్న' కేటగిరీలో ఉన్న ఫెర్రోస్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్)ను జపాన్‌కు చెందిన బహుళజాతి సంస్థకు అమ్మివేయాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఆ సంస్థలోని కార్మికులు సెప్టెంబర్ 28 నుండి నిరవధిక సమ్మెలో ఉన్నారు.

ఈ మధ్యకాలంలో స్కీమ్ వర్కర్లు అనేక పోరాటాలు చేశారు. మహారాష్ట్రలో అన్ని యూనియన్ల సంయుక్త పిలుపుమేరకు అంగన్ వాడీలు నిరవధిక సమ్మెకు పూనుకోవడం వీటన్నింటిలో ముఖ్యమైనది. కర్ణాటకలో ఐసిడిఎస్ నుంచి ప్రీ స్కూల్ పనిని తప్పించేందుకు అక్కడి ప్రభుత్వం ప్రయత్నించడంతో ఆగస్టు నెలలో అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేశారు. గత్యంతరం లేక ఆ రాష్ట్రప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. జమ్ముకాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో కూడా అంగన్‌వాడీ కార్మికులు సమస్యల పరిష్కారానికి పోరు బాట పట్టారు.

## మహిళలు, పిల్లలపై పెరుగుతున్న లైంగిక దాడులు

మహిళలు, మైనర్ ఆడపిల్లలపై ఈ మధ్య కాలంలో లైంగిక దాడులు పెరిగిపోయాయి. గుజరాత్‌లోని దహోద్‌లో ఆరేళ్ల బాలికపై ఆ స్కూల్

ప్రధానోపాధ్యాయుడు లైంగికంగా దాడి చేసి హత్యచేశాడు. మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో ఇద్దరు పాఠశాల విద్యార్థినుల మీద లైంగిక దాడి జరిగింది. ఈ వికృత చర్యకు నిరసనగా ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో దానిని చల్లార్చేందుకు, తమ కస్టడీలో ఉన్న నిందితుడిని ఫేక్ ఎన్‌కౌంటర్ ద్వారా కాల్చి చంపారు.

## వయనాడ్ ఉత్పాతం

కేరళలోని వయనాడ్ జిల్లాలో జులై 30న కొండచరియలు విరిగిపడి విధ్వంసం సృష్టించాయి. నాలుగు గ్రామాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. 231 మంది పౌరులు మరణించారు. 47 మంది జాడ ఇప్పటికీ తెలియడం లేదు. రాష్ట్ర పోలీసులు, కేంద్ర రాష్ట్ర విపత్తుల ఉపశమన సంస్థలకు చెందిన సిబ్బంది సాయంతో కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలకు పూనుకున్నది. నిర్వాసితులకు తక్షణ ఆర్థిక సాయం అందించి వారికి పునరావాసం కల్పించే చర్యలు చేపట్టింది. బాధితులను ఆదుకునేందుకు అవసరమైన ధన, వస్తు సహకారాన్ని సమీకరించేందుకు పార్టీ, ప్రజాసంఘాలు చురుకుగా కృషి చేస్తున్నాయి. ఇంత ఉత్పాతం జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మధ్యంతర సాయం కూడా ప్రకటించకపోవడం విస్మయానికి గురి చేస్తున్నది.

## జమ్మూ-కాశ్మీర్, హర్యానా శాసనసభ ఎన్నికలు

జమ్మూ కాశ్మీర్ లో మూడు దశలలో శాసనసభ ఎన్నికలు నిర్వహించనున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ పార్టీతో కుదిరిన అవగాహన మేరకు కుల్‌గావ్ నియోజకవర్గం నుండి  సిపిఐ(ఎం) అభ్యర్థి మొహమ్మద్ యూసఫ్ తరిగామి పోటీ చేస్తున్నారు. హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో అవగాహన కుదుర్చుకుని సిపిఐ(ఎం) భివానీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నది.

## విదేశాంగ విధానం - వ్యూహాత్మక చర్యలు

ఆగస్టు 23న ప్రధాని మోడీ ఉక్రెయిన్ పర్యటనకు వెళ్లాడు. ఇది అమెరికాను శాంతింప చేయడానికి చేపట్టిన కార్యక్రమం తప్ప వేరొకటి కాదు. జులై నెలలో

మోడీ మాస్కో పర్యటించి ఆ దేశాధ్యక్షుడు పుతిన్ చేతుల మీదుగా అత్యున్నత పౌర అవార్డును అందుకున్నాడు. మోడీ రష్యా పర్యటనకు వెళ్లిన రోజుల్లోనే నాటో 75వ వార్షికోత్సవ సదస్సును అమెరికాలోని వాషింగ్టన్ నగరంలో నిర్వహించింది. రష్యాలో పుతిన్‌కి వ్యతిరేకంగా నాటో దేశాల శక్తులన్నీ కలిసికట్టుగా బల ప్రదర్శనకు పూనుకున్న సమయంలోనే మోడీ పుతిన్‌ను వాటేసుకున్న దృశ్యాలు ప్రసారమయ్యాయి. మోడీ రష్యా పర్యటనపై బైడెన్ అధికార యంత్రాంగంలోని వేర్వేరు అధికారిక ప్రతినిధులు వరుసపెట్టి అసంతృప్తి రాగం ఆలపించారు. మన దేశంలోని అమెరికా రాయబారి అయితే '(మన) రెండు దేశాల మధ్య సంబంధాలను ఇష్టారాజ్యంగా తీసుకోవద్దు.' ఘర్షణ పూరిత వాతావరణంలో 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి' కి చోటులేదు అంటూ బెదిరింపు స్వరంతో హెచ్చరించాడు. అమెరికా మొత్తడంతో మోడీ హడావుడిగా ఉక్రెయిన్ పర్యటన ఖరారు చేసుకుని ఆ దేశాధ్యక్షుడు జెలెన్స్కీని కలిసివచ్చాడు. ఆ తరువాత మళ్లీ ఐక్యరాజ్యసమితి సమావేశాలు జరుగుతుండగా న్యూయార్క్‌లో జెలెన్స్కీతో మోడీ కలిసి అమెరికా ప్రాపకం పొందేందుకు, తద్వారా సాంప్రదాయికంగా భారత్, రష్యా దేశాల మధ్య ఉన్న మైత్రీ సంబంధాలను పలుచన చేయడానికి ఉత్సాహాన్ని కనబరుస్తున్నాడు.

మన దేశం వివిధ ఐరోపా దేశాలకు అమ్మిన ఆయుధాలను ఉక్రెయిన్ ఉపయోగించడాన్ని మోడీ ప్రభుత్వం అభ్యంతర పెట్టలేదంటూ నివేదికలు వెలువడడం కూడా అమెరికా ప్రాపకం కోసం మోడీ చేస్తున్న ప్రయత్నాలకు మరొక ఉదాహరణ. సెప్టెంబర్ 21న అమెరికాలోని డెలావర్ రాష్ట్రంలోని విల్మింగ్టన్ లో 'క్వాడ్' దేశాల సదస్సు జరిగితే దానికి ప్రధాని మోడీ హాజరయ్యాడు. ఈ సదస్సు విడుదల చేసిన ప్రకటనలో చైనాకు వ్యతిరేకంగా పరుష పదజాలాన్ని ఉపయోగించారు. అంతటితో ఆగకుండా మరిన్ని భద్రతా ఆధారిత ఒప్పందాలు కూడా కుదిరాయి. అమెరికా రూపొందించి, 'క్వాడ్' ద్వారా అమలు చేస్తున్న, 'ఇండో పసిఫిక్' వ్యూహానికి భారతదేశం మరింత కట్టుబడిపోయింది.

పాలస్తీనాలో ఆక్రమించుకున్న భూభాగాల నుండి ఇజ్రాయిల్ వైదొగాలంటూ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశాల్లో ప్రవేశపెట్టిన తీర్మానంపై

మనదేశం ఓటింగ్ నుండి గైర్హాజరు అయ్యింది. అమెరికా అడుగుజాడల్లో మనదేశం నడుస్తున్నదనడానికి ఇది తార్కాణం. పాలస్తీనా ఆక్రమిత భూభాగాల నుండి ఇజ్రాయిల్ వైదొలగాలని మన దేశం ఏనాటి నుండో స్పష్టమైన వైఖరి అనుసరిస్తూ వచ్చింది. మోడీ ప్రభుత్వం ఆ వైఖరిని విడిచిపెట్టడమే కాదు గాజాను ఆక్రమించేందుకు అవసరమైన ఆయుధ సామాగ్రిని ఇజ్రాయిల్‌కు ఎగుమతి చేస్తోంది.

## కేంద్ర కమిటీ పిలుపులు

గాజాలోని పాలస్తీనా పౌరుల మీద ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి హననానికి ఏడాది నిండుతున్న నేపథ్యంలో అక్టోబరు 7న అన్ని వామపక్ష పార్టీలతో కలిసి పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించాలని పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించింది.

1) 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' ప్రతిపాదనకు వ్యతిరేకంగా

2) ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, పెట్రోల్, డీజిల్ రీటైల్ ధరలు తగ్గించాలని

3) నిరుద్యోగం, ప్రయివేటీకరణలకు వ్యతిరేకంగా

4) మహిళలు, బాలికలపై లైంగిక దాడుల నిరోధానికి చర్యలు చేపట్టాలని దేశవ్యాప్త ప్రచారం నిర్వహించాలని కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

**2024** అక్టోబరు **15** – నవంబర్ **15** మధ్య కాలంలో ప్రతి రాష్ట్రంలో ఈ ప్రచారాందోళన కార్యక్రమాలను వారం రోజుల పాటు నిర్వహించాలని కేంద్రకమిటీ నిర్ణయించింది. ఆయా రాష్ట్ర కమిటీలు ధరల పెరుగుదల, నిరుద్యోగం, మహిళలపై దాడులకు సంబంధించి స్థానిక నిర్దిష్ట అంశాలను జోడించి డిమాండ్లను రూపొందించాలి.

= = =

ప్రతులు : 1000 ప్రచురణ కాలం : అక్టోబర్ 2024 వెల : ₹ . 15/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ – 2,

ఫోన్ నెం. 0866-2577202